దొంగ ఓట్ల పాపం టీడీపీదే

- 2017–18 ఓటరు జాబితాలో అడ్డగోలుగా చేర్పులు
- డూప్లికేట్ ఓట్ల తొలగింపుతో బహిర్గతమవుతున్న నిజాలు



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం: టీడీపీ హయాంలో చేర్పిన దొంగ ఓట్లు బహిర్గతమవుతున్నాయి. 2019 ఎన్నికల్లో దొడ్డిదారిలో గట్టెక్కడం కోసం ఓటరు జాబితాలోకి అడ్డగోలుగా చేర్పిన డూప్లికేట్ ఓట్ల ఏరివేత ప్రక్రియతో ఆ నిజాలు వెలుగు చూస్తున్నాయి. దీంతో ఆ నిందను వైఎస్సార్‌సీపీపై నెట్టి తప్పించుకునేలా టీడీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. టీడీపీ తీరు పై అధికార పార్టీ నాయకులే కాక ప్రజలు కూడా ఛీదరించుంటూ దొంగ ఓట్ల నైజంపై అసహ్యించుకుంటున్నారు. ఒకరికి ఒకే ఓటు నిబంధనను భారత ఎన్నికల సంఘం పటిష్టంగా అమల్లోకి తీసుకువచ్చింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాను పకడ్బందీగా ప్రక్షాళన చేసే దిశగా కసరత్తు చేపట్టింది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓట్లు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ కారణంగా టీడీపీ హయాంలో చేర్పిన డబుల్ ఎంట్రీ ఓట్లు కుప్పలు, తెప్పలుగా బయటపడ్డాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 6,92,107 ఓట్లు ఉండగా, వీటిలో 06-01-2022 నుంచి 31-03-2023 వరకూ 16,354 డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించారు. వీటిపై మరోసారి నియోజకవర్గం ఆర్‌ఓల సమక్షంలో పరిశీలన జరిపేలా చర్యలు చేపట్టారు. వీటికి తోడు డెత్, మైగ్రేట్, వివిధ ప్రాంతాలకు బదిలీ వెళ్లిన ఉద్యోగులు, పిల్లల చదువుల కోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని గుర్తించి రెండు చోట్ల ఓటు నమోదు చేసేలా టీడీపీ నాయకులు గతంలో చక్రం తిప్పారు. ఇలా రెండు, మూడు చోట్ల ఓటు హక్కు ఉండడంతో మొత్తం ఓటర్ల సంఖ్యలో తేడా గుర్తించారు. ఫోటో సిమిలార్ ఎంట్రీస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఫోటోల ఆధారంగా డబుల్ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియ వేగవంతం చేశారు.

ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	తొలగించిన డబుల్ ఎంట్రీ ఓట్లు
రాయదుర్గం	2,54,392	6,110
కళ్యాణదుర్గం	2,22,234	4,899
ఉరవకొండ	2,15,481	5,345

తప్పుల్లేని జాబితా తయారీకి శ్రీకారం



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పుల్లేని ఓటరు జాబితా తయారీ కోసం పటిష్ట చర్యలు చేపట్టాం. జూలై 1 నుంచి చేపట్టిన ఇంటింటికీ వెళ్లి ఓటరు పరిశీలన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయిస్తున్నాం. డబుల్ ఎంట్రీలు, మృతులు, ఊరువదిలి వెళ్లిన వారిని గుర్తించి క్షుణ్ణంగా పరిశీలన చేశాకే జాబితా నుంచి తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. ఓటరు జాబితాలో చిన్న పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాం. బీఎల్‌ఓలకు సైతం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

\- నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

టీడీపీ కుట్ర భగ్నం



ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ అడ్డదారుల్లో అందలం ఎక్కాలనే కుట్రను ప్రజలే భగ్నం చేశారు. 2019 ఎన్నికల్లో ఎన్ని కుయుక్తులు పన్నినా చివరకు న్యాయం వైపే ప్రజలు అండగా నిలిచారు. 2017–18 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉండే సమయాన చేర్పిన బోగస్ ఓటర్లు తాజా సర్వే ద్వారా బహిర్గతమవుతుండడం విశేషం. డూప్లికేట్ ఓటర్లన్నీ ఏరివేసి సమగ్ర ఓటరు జాబితా తయారీకి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టడం హర్షణీయం. మంత్రిగా ఉండే సమయాన కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో ఇలాంటి కుట్రలకు పాల్పడడంతోనే 6,110 ఓట్లు తొలగించాల్సి వచ్చింది.

\- కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

అభివృద్ధి ఓర్వలేకనే ఫిర్యాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: కళ్లముందు గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు ఓటర్ల పరిశీలనను తప్పుబడుతూ అప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ నాయకులకు ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. కేవలం దొంగ ఓట్లను ప్రజాస్వామ్యబద్ధంగా తొలగించడాన్ని ఓర్వలేక గతంలో మాదిరి కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌కు పాల్పడుతూ గ్రామాల్లో దౌర్జన్యం చేయడమే లక్ష్యంగా టీడీపీ వ్యవహరిస్తోందన్నారు. దొంగ ఓట్లకు చెల్లుచీటీ పెట్టేలా పరిశీలన కొనసాగుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీని అవినీతితో రాజ్యమేలిన టీడీపీ విమర్శలు చేయడం తగదన్నారు. అభివృద్ధి, దొంగఓట్ల తొలగింపుపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, బూత్ కన్వీనర్ మచ్చన్న, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, రమనేపల్లి సర్పంచ్ రమేష్, నాయకులు త్రిలోక్‌రెడ్డి, రాజగోపాల్, తిమ్మారెడ్డి, రామేశ్వరరెడ్డి, పురుషోత్తంరాజు, బాబు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త రుక్మిణిబాయి

కళ్యాణదుర్గం: విద్యార్థులు డిగ్రీ స్థాయిలో అవకాశాలను అంది పుచ్చుకోవాలని మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త ఎం.రుక్మిణిబాయి సూచించారు. స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేట్ రంగ సంస్థలు నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సమన్వయకర్త రుక్మిణిబాయి పలు సర్టిఫికెట్ కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శైలజారాణి, చాముండేశ్వరి, ఎంటీ జ్యోత్స్న, ప్రభావతి, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా క్రిష్ణ



బ్రహ్మసముద్రం: మండలం రీసర్వే నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా కె.క్రిష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కళ్యాణదుర్గం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'భూ సర్వే' బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

కంబదూరు: బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను విద్యార్థినులు, బాలికలు, మహిళల అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ బి.శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని తిమ్మాపురంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో డీఎస్పీ ఆధ్వర్యంలో దిశ చట్టం, దిశ యాప్ డౌన్‌లోడ్, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం/శెట్టూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖ కార్యాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న పుస్తకాల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, పాఠకులు పాల్గొన్నారు. అలాగే శెట్టూరు మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సెస్ వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి రజిని, పాఠకులు పాల్గొన్నారు.

మల్లాపురంలో చోరీ



దొంగలు పగలగొట్టిన బీరువా

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామంలో గురువారం దొంగతనం జరిగింది. బాధితుని వివరాల మేరకు... మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న గురుమూర్తి ఐస్‌క్రీం విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే పనికి వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి రూ.50 వేల నగదు, రెండు జతల వెండి పట్టీలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రీ వెరిఫికేషన్ పకడ్బందీగా చేయాలి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ, డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య

రాయదుర్గం రూరల్: తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడం కోసం రీ వెరిఫికేషన్ పకడ్బందీగా చేయాలని డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ నీలమయ్య ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం ఏఈఆర్‌ఓలు, డీటీ, ఈడీటీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మధ్యాహ్నం బీఎల్‌ఓల సమావేశంలో ఆయన ఓటరు జాబితా వెరిఫికేషన్‌పై పలు సూచనలు, సలహాలిచ్చారు. రీవెరిఫికేషన్ 25వ తేదీ లోపు ముగించాలన్నారు. నియోజకవర్గంలోని పట్టణంతో పాటు ఐదు మండలాల్లో 2023 జనవరి దాకా 290 పోలింగ్ స్టేషన్లలో 2,54,392 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. బీఈఎల్‌ఓలు నమోదు చేసిన, తొలగించిన, చిరునామా మార్పులను ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇంటింటికి తిరిగి, కుటుంబసభ్యుల డిక్లరేషన్‌తో తొలగింపులు చేయాలని మధ్యాహ్నం జరిగిన సమావేశంలో ఆయన బీఎల్‌ఓలకు సూచించారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారికి ఆధార్ లింక్ చేసి, వారు తొలగించమన్న చోట జాబితా నుంచి పేరు తొలగించి, కోరిన చోట ఉంచాలన్నారు. రాయదుర్గం ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు రాజకీయ పార్టీల నాయకులు ప్రతిపాదించాలన్నారు. మండలంలో మల్లాపురం తాండా, ఆర్బీ వంక గొల్లలదొడ్డిలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. టి.వీరాపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు పోలింగ్ స్టేషన్ మార్పిడికి ప్రతిపాదించామన్నారు. అలాగే మున్సిపాలిటీలో కూడా బీటీపీ లేఅవుట్, మల్లాపురం లేఅవుట్, గౌడ లేఅవుట్‌లలో అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించాలని వామపక్ష పార్టీల నాయకులు అధికారులను కోరారు. రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరిస్తే, తప్పులు లేని, ఓటరు జాబితా సిద్ధం చేయడానికి సాధ్యమన్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా 2,518 కొత్త ఓట్లు నమోదయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలుగా నియమించిన రాయదుర్గం, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు తహసీల్దార్లు మారుతి, బాలఈశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రజాక్‌వలి, ఈడీటీ సుజాత, గుమ్మఘట్ట డీటీ రఘు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, మున్సిపల్ టీపీఓ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామ శివారులోని 'జగనన్న కాలనీ'లో మూడు రోజుల నుంచి నెలకొన్న ఉత్కంఠకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చొరవతో తెరపడింది. కణేకల్లు క్రాస్–బళ్లారి అంతరాష్ట్ర రహదారి పక్కన ఊరు శివారులో మూడేళ్ల క్రితం ప్రభుత్వం 'జగనన్న లేఅవుట్'ను వేయించి పేద, నిరుపేదలైన 110 మందికి పట్టాలను పంపిణీ చేసింది. ఐతే ఈ స్థలం తనదంటూ అదే గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ కోర్టును ఆశ్రయించాడు. బాధితులు న్యాయం కోసం పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కారు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గురువారం యర్రగుంట గ్రామ సచివాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ఒక్కసారి ఇంటిపట్టాలిచ్చాక... ఏ సమస్య ఉన్నా, అడ్డంకులున్నా తొలగించి పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సర్వే నంబర్ 272లో 112 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాలిచ్చిందని ఈ స్థలాలపై సర్వహక్కులు మీకేనని లబ్ధిదారులకు విప్ భరోసా ఇచ్చారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా భయపడొద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. మీకేమైనా ఇబ్బంది కలిగితే ఫోన్ చేయమని తన ఫోన్ నంబర్ ఇచ్చారు. కాలనీలో కరెంటు, తాగునీరు, రోడ్లు తదితర కనీస సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో ఆలస్యం చేయొద్దని హౌసింగ్ ఏఈఈ రామాంజనేయులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఆర్ డీఈఈ రామ్మోహన్‌రెడ్డి, జేఈ జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, ఆర్‌ఐ అశ్వర్థనారాయణ, ఎంపీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, నాయకులు గొల్ల భీమిరెడ్డి, పెద్దదేవర మాబుపీరా, నబీసా, సీఐ యుగంధర్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం

బ్రహ్మసముద్రం: వేపులపర్తిలో ప్రతి మంగళవారం నిర్వహించే కూరగాయల సంత నిర్వహణకు సర్పంచ్ పి.రంగప్ప, ఎంపీటీసీ బూషప్ప అధ్యక్షతన వేలం నిర్వహించారు. కాలువపల్లి వెంకటేశులు రూ.58.300కు మార్కెట్ దక్కించుకున్నాడు. ఎంపీడీఓ దాసానాయక్, ఏఓ నందకుమార్, పంచాయతీ కార్యదర్శి సత్యమ్మ పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేద్దాం

కంబదూరు: ప్రజా పంపిణీ వ్యవస్థను అందరి సమన్వయంతో పటిష్టం చేద్దామని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ తిమ్మరాజమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి ఆహార సలహా సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరగకుండా ప్రజలకు నిత్యావసరాలను సక్రమంగా అందేలా కృషి చేద్దామన్నారు. పౌరసరఫరాల గోదాము నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో అక్రమాలకు అవకాశం ఉండకూడదన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాల అమలులో నాణ్యత పాటించాలని, వీటిపై నిత్యం తనిఖీ ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నయాజ్ అహ్మద్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీఎస్‌డీటీ విజయలక్ష్మి, సభ్యులు గోవిందప్ప, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మీసేవ కుమార్, మల్లేష్, ఆకుల గంగప్ప, రవీంద్రనాథ్, రామ్మోహన్, లాలెప్ప, రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడి, హెచ్ సిద్దాపురం గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి గురువారం తెలిపారు. ఉదయం 8:30 గంటలకు మలపనగుడి, మధ్యాహ్నం 3:30 గంటలకు సిద్దాపురంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో అందరికీ వైద్య సేవలందాలి

కూడేరు: ఫ్యామిలీ ఫిజియన్ ద్వారా ప్రజలందరికీ వైద్యసేవలు అందేలా చూడాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం కూడేరు పీహెచ్‌సీలో ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందే వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు వరలక్ష్మి, మోహన్ బాబు, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కూడేరు: మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు జయమ్మ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆమె కూడేరులో మండలంలోని భోజన పథకం కార్మికుల మండల యూనియన్ నేతలతో కలిసి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. వంట చేసే సమయంలో ప్రమాదానికి గురైతే బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. భోజన కార్మికుల సమస్యల సాధన కోసం సీఐటీయు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీదేవి, పార్వతమ్మ, వేణు, శ్రీకాంత్, లక్ష్మీబాయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

బొమ్మనహాళ్: శరీరానికి అవసరమయ్యే పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య రాదని దర్గాహొన్నూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుల్తానా సూచించారు. గురువారం మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగ నిర్ధారణ, లింగ వివక్షతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు కార్యాలయాల ప్రారంభం

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడిలో నిర్మించిన నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి శుక్రవారం రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమానికి ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బెళుగుప్ప: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను స్థానిక వేంకటేశ్వర కల్యాణ మంటపంలో గురువారం ఏపీటీఎఫ్–1938 మండల కార్యవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో ఎంపీడీఓ పోస్టు సాధించిన బెళుగుప్పకు చెందిన ఉపాధ్యాయుడు కవిరాజును దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్–1938 మండల శాఖ నూతన అధ్యక్షుడిగా చెన్నబసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, కమిటీ సభ్యులు మద్దిలేటప్ప, శ్రీనివాసనాయక్, వజీర్‌బాషా, పీవీ ప్రసాద్, హనుమంతునాయక్, చంద్రశేఖర్, దామోదర్, ప్రమీల, శైలజ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకులకు సన్మానం

కుందుర్పి: సచివాలయ ప్రారంభోత్సవానికి అప్పిలేపల్లికి వచ్చిన మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం సర్పంచ్ అతావుల్లా సమక్షంలో వైఎస్సార్‌సీపీ దళిత నాయకులను సన్మానించారు. పార్టీ కోసం కష్టపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనుమప్ప, మురుకుల కొల్లప్ప, అంజినప్ప, మందలపల్లి దురగప్ప, మోటు హనుమంతప్ప, జటింగ దురగప్పను మంత్రి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు సహించం

గుమ్మఘట్ట: ఉపాధి పథకంలో అక్రమాలు జరిగితే సహించేది లేదని ఎంపీడీఓ నరసింహమూర్తి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలకు రోజుకు రూ.272 వేతనం పడేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈసీ అంజన్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

కూడేరు/బ్రహ్మసముద్రం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పని చేస్తున్న వీఓఏ(యానిమేటర్లకు)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏ యూనియన్ మండల అధ్యక్షుడు నాగార్జున, ప్రధాన కార్యదర్శి అక్కమ్మ, సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం వారు ఎంపీడీఓ ఎంకే బాషాని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే బ్రహ్మసముద్రంలో తహసీల్దార్ బాలకిషన్‌కు ఆనిమేటర్లు వినతిపత్రం అందజేశారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

బెళుగుప్ప: మండల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆవులెన్న ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్.నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా రాధ, బి.తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రాజు ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా



తాగునీరు సరఫరా చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండకు ఉరవకొండ ప్రాజెక్ట్ నుంచి, పంచాయతీ తరఫున తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో 'సాక్షి' దిన పత్రికలో బుధవారం 'ట్యాంకర్‌తో మంచి నీరు సరఫరా చేయండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించి గురువారం ట్యాంకర్‌ను ఏర్పాటు చేసిన వీధుల్లో తాగు నీటిని సరఫరా చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తక్షణసాయం పంపిణీ

ఉరవకొండ: స్థానిక సచివాలయం–5 పరిధిలోని ఎస్‌ఎల్‌ఎన్ కాలనీకు చెందిన సాబే వెంకటచలం మృతి చెందడంతో గురువారం మృతుని భార్య లలితమ్మ, కుమారుడు నవీన్‌కు వైఎస్సార్ బీమా కింద ద్వారా తక్షణసాయం అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు జోగి భీమా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శర్మాస్, అమర్నాథ్, రాంరెడ్డి, హనుమంతు, అబ్దుల్, మనోహర్, లక్ష్మీనారాయణ వార్డు వలంటీర్ బళ్లారి ముబీనా ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ బీమా మిగతా సాయాన్ని త్వరలో నామినీ ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మండలంలోని మల్లిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుధాకర్ (43) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ మండల సచివాలయ కన్వీనర్ ఆంజినేయులు, స్థానిక నాయకులు సూరప్ప, బడప్ప, పార్వతి, ఓబిలేశు, మారుతి, తిప్పేస్వామి, మధు, చిన్ని, మల్లికార్జున, అజయ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం నుంచి విడుదలైన తక్షణసాయం రూ.10 వేలను మృతుని భార్య గంగమ్మకు అందజేశారు. మిగిలిన సాయం త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు.

'చంద్రయాన్' విజయోత్సవ సంబరాలు



ఉరవకొండ: 'విక్రమ్' నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉరవకొండ/కళ్యాణదుర్గం రూరల్/రాయదుర్గం రూరల్: ఉరవకొండలోని ప్రభుత్వ ఇంటర్ బాలుర, బాలికల కళాశాలలో 'చంద్రయాన్' విజయం మనందరి విజయం అని నినదిస్తూ గురువారం జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతీయుల విజయోత్సవ, ఇస్రో సైంటిస్టులకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మమత, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, ఎస్‌ఐ వెంకటస్వామి పాల్గొన్నారు. అలాగే చంద్రయాన్–3 విజయవంతంగా ల్యాండింగ్ కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఉరవకొండలోని శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విక్రమ్ ల్యాండింగ్ నమూనా ప్రదర్శించారు. అదే విధంగా కళ్యాణదుర్గం పట్టణంలోని సరస్వతి విద్యామందిరం విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే చంద్రయాన్ విజయంపై కళ్యాణదుర్గంలో వామపక్ష నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

కంబదూరు: ఉపాధి పథకం కింద వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఏపీఓ హుస్సేన్ ఆలీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019–2024 మధ్య 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్న కుటుంబాలకు అసరాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉచితంగా శిక్షణ ఇచ్చి బహుళజాతి కంపెనీ(ఎంఎన్‌సీ)ల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. వివరాలకు 9963901653 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సమస్యలుంటే తెలపండి

కళ్యాణదుర్గం: కాలనీలో సమస్యలుంటే వెంటనే తెలపాలని 23వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అర్చన సూచించారు. తాగునీటి సమస్య ఉందని ప్రజల నుంచి ఫిర్యాదు అందడంతో గురువారం సచివాలయ సిబ్బందితో కలసి ఆమె కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాలనీవాసులతో ప్రభుత్వ పథకాల అమలు, అందుతున్న తీరుపై ఆరా తీశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.